

సోమశిలలో 21.279 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారానికి 21.279 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 676 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,680
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,450
3 శాతం జీఎస్టీతో..	రూ.5,613
నవర (8 గ్రా)	రూ.44,904

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0 /27.6

మంగళవారం గాలిలో తేమ 42 శాతం ఉంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. బుధవారం అధిక ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

త్యాగధనులను స్మరించుకుందాం

• కలెక్టర్ ఎం.హరినారాయణన్



జెండా ఎగురవేస్తున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కలెక్టర్ ఎం.హరి నారాయణన్ పేర్కొన్నారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, కలెక్టరేట్ ఏఓ షఫీ మాలిక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో స్వాతంత్ర్య వేడుకలు



జాతీయజెండా ఎగురవేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని

నెల్లూరు(లీగల్): న్యాయశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు జడ్జిలు కపర్ది, సత్యవాణి, తేజోవతి, శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి బాలాజీ, లోక్ అదాలత్ జడ్జి వాణి, పలు కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ...

నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అన్వర్‌బాషా, ఉపాధ్యక్షుడు సుభానీ, ట్రెజరర్ ధన్పాల్ రమేష్, కార్యవర్గం, న్యాయవాదులు పాల్గొన్నారు

సీఐడీ డీఎస్పీ రాంబాబుకు ఇండియన్ పోలీస్ మెడల్



మెడల్ స్వీకరిస్తున్న డీఎస్పీ రాంబాబు

నెల్లూరు సిటీ: స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సీఐడీ డీఎస్పీ డీఎస్ రాంబాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఇండియన్ పోలీస్ మెడల్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు.

మహనీయుల పోరాట ఫలితమే స్వాతంత్ర్యం



త్రివర్ణ పతాకం ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన కలెక్టర్ హరినారాయణన్

• జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు
• పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకగా పంద్రాగస్టు సంబరాలు
• మువ్వన్నెల జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన మంత్రి
• సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, వేదికపై కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అంబటి జాతీయజెండాను ఎగురవేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రజానీకానికి, అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రగతిపై వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ నవరత్నాల పథకాల ద్వారా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్ రైతుభరోసా, ఆరోగ్యశ్రీ, ఆసరా, చేయూత, సున్నావడ్డీ రుణాలు, సామాజిక పెన్షన్లు, పేదలందరికీ ఇళ్లు, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, జగనన్న తోడు తదితర సంక్షేమ పథకాలతోపాటు వైఎస్సార్ వాహనమిత్ర, నేతన్ననేస్తం, కాపునేస్తం, 104, 108 సేవలు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకం, ప్రత్యేక వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

పారదర్శకతతో కూడిన సుపరిపాలనలో భాగంగా శాస్త్ర సాంకేతికత సాయంతో నూతన విధానాలను అనుసరిస్తూ గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు సత్వరమే అందేలా జిల్లాలో 769 గ్రామ, వార్డు సచివాలయాలను, 561 ఆర్‌బీకేలను ఏర్పాటు చేసిందన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తూ రైతుభరోసా పథకం ద్వారా రైతులకు రూ.118 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రూ.66 కోట్ల విలువ గల యంత్ర పరికరాలు, రూ.23.16 కోట్ల సబ్సిడీ ఆయా గ్రూపులకు అందించినట్లు తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా రూ.87.36 కోట్ల విలువైన ఎరువులను రైతులకు అందించామన్నారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ ద్వారా ఆర్‌కే వీవై పథకం కింద రూ.1.98 కోట్ల రాయితీని రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. మహిళా పాల సహకార సంఘాలను జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు రూ.12.720 కోట్లు పంపిణీ చేశామన్నారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50లకే సరఫరా చేశామని తెలిపారు. జువ్వలదిన్నెలో రూ.288.86 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పురోగతిలో ఉందని, కృష్ణపట్నం పోర్టు ద్వారా 7,500 మందికి ప్రత్యక్షంగా, 20 వేల మందికి పరోక్షంగా ఉపాధి అందుతుందని, రామాయపట్నం పోర్టు నిర్మాణం రూ.3,700 కోట్లతో వేగవంతంగా జరుగుతోందని తెలిపారు. వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా 3,07,447 మందికి సంవత్సరానికి రూ.1425.26 కోట్ల నగదును ప్రతి నెలా 1వ తేదీనే అందిస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించామన్నారు. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.229.70 కోట్లు, ఆసరా పథకం ద్వారా రూ.617.91 కోట్లు, జగనన్న తోడు పథకం ద్వారా రూ.11.82 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. జిల్లాలో 20,882 మంది గృహనిర్మాణ లబ్ధిదారులకు రూ.73.8 కోట్లు వడ్డీలేని రుణాలు అందించామన్నారు. నాడు–నేడు రెండో దశలో పాఠశాలల్లో మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.293 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. మాతా శిశు మరణాలు తగ్గించడంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో 43,270 ఎకరాల చుక్కల భూమి క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకం ద్వారా 163 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తి చేసి భూహక్కు పత్రాలు అందజేసినట్లు తెలిపారు. జలవనరులశాఖ ద్వారా రూ.9.4 కోట్ల అంచనాలతో సర్వేపల్లి రిజర్వాయర్ శాశ్వత పునరుద్ధరణ పనులు చేపట్టారన్నారు. నగరంలోని సర్వేపల్లి కాలువను రిటైనింగ్ వాల్స్ నిర్మాణ పనులు, పెన్నానదికి కొత్త రహదారి వంతెన వరకు రిటైనింగ్ వాల్స్ పనులు, మలిదేవి డ్రెయన్ ఆధునికీకరణ పనులు, జాఫర్ సాహెబ్ కాలువ గోడ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. సోమశిల జలాశయం వద్ద దెబ్బతిన్న ఆఫ్రాన్ పునరుద్ధరణకు రూ.117 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లాలోని పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల సహాయ సహకారాలతో జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు కేవీ చలమయ్యను మంత్రి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ సంజనాసిన్హా, ఏఎస్పీ హిమవతి, డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, వివిధ శాఖల అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తొలుత ఓ ప్రజాప్రతినిధిని ప్రజలు కలుసుకునేందుకు వెళ్లేటప్పుడు అతనిపై ఉగ్రవాదులు దాడిచేస్తే భద్రతా సిబ్బంది ఎలా కాపాడతారో ప్రదర్శన ద్వారా చూపారు. అలాగే దర్గామిట్టలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, గొలగమూడి ఏపీ బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు, బిట్రగుంటలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గొలగమూడిలోని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ స్కూల్ విద్యార్థులు, ఏఎస్‌పేటలోని కస్తూర్బాగాంధీ బాలికల బాలుర రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థులు, సర్వేపల్లి నియోజకవర్గంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్స్ స్కూల్ విద్యార్థులు, అలాగే పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు మంత్రి చేతులమీదుగా జ్ఞాపికలు అందజేశారు.



గ్యాలరీలో ఆశీనులైన వివిధ శాఖల అధికారులు



జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, రామ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాటామంతీ



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో అలరిస్తున్న విద్యార్థులు



రింగులతో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు



ప్రజాప్రతినిధిని రక్షించే ప్రదర్శన ఇస్తున్న భద్రతా సిబ్బంది



కవాతు చేస్తున్న పోలీసులు



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



గిరిజన నృత్యంతో అలరిస్తున్న విద్యార్థినులు

నిరుద్యోగులకు అండగా..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. నిరుద్యోగులను గుర్తించి వారికి విద్యార్హతల ఆధారంగా వివిధ రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.

• ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం
• శిక్షణ సమయంలో రోజుకు రూ.272 స్టైపెండ్



శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు (ఫైల్)

నెల్లూరు(పొగతోట): జిల్లాలో ప్రస్తుతం 8 శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. నెల్లూరులో 5, వెంకటాచలం, ఆత్మకూరు, కావలిలో ఒక్కొక్కటి చొప్పున శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాదికి సంబంధించి త్వరలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కేంద్రాల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనులు పూర్తి చేసిన కుటుంబాల్లోని నిరుద్యోగ మహిళలకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.272 స్టైపెండ్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్(సీడాప్) ద్వారా కూడా నిరుద్యోగులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీనికి 18 నుంచి 35 సంవత్సరాల వయసు లోపు వారు అర్హులు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు 3,540 మంది నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చారు. వారిలో 2,680 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. జాబ్ మేళాలు నిర్వహించి 3,646 మందికి వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ప్రస్తుతం డీఆర్‌డీఏ అధికారులు 10, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, బీటెక్ తదితర చదువులు పూర్తి చేసిన వారి వివరాలు సేకరిస్తున్నారు. వారి చదువును బట్టి ఏఏ రంగాల్లో శిక్షణ ఇవ్వాలో గుర్తిస్తున్నారు. శిక్షణ పొందిన వారికి డీఆర్‌డీఏ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ, అనేక పవర్ ప్రాజెక్టులు, పరిశ్రమలు ఉన్నాయి. ప్రస్తుతం పరిశ్రమల్లో కార్మికుల కొరత అధికంగా ఉండడంతో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని పరిశ్రమల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోని భారీ పరిశ్రమల్లో కూడా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

శిక్షణ కార్యక్రమాలు

సీఆర్‌ఎం డొమెస్టిక్ నాన్–వాయిస్, మెడికల్ ఎక్విప్‌మెంట్ టెక్నీషియన్(బేసిక్ క్లినికల్ ఎక్విప్‌మెంట్), ఫీల్డ్ టెక్నీషియన్–కంప్యూటింగ్, పెరిఫెరల్స్, ఆటోమోటివ్ సర్వీస్ టెక్నీషియన్, మల్టీ స్కిల్ టెక్నీషియన్, టూర్ మేనేజర్, ఈవెంట్ మీటింగ్ కాన్ఫరెన్స్ ప్లానర్, ఫెసిలిటీ మేనేజర్ తదితర శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నారు. 3, 6, 12 నెలలపాటు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మెటీరియల్, ఎన్‌ఎస్‌డీసీ సర్టిఫికెట్ అందజేస్తారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం కావాల్సి ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని 8 శిక్షణ కేంద్రాల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తాం. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

ఉత్తమ సేవకు సత్కారం

నెల్లూరు (దర్గామిట్ట) : విధి నిర్వహణలో ఉత్తమ సేవలు కనబరిచిన వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పురస్కారాలు అందుకున్నారు. నెల్లూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ చేతులమీదుగా కందుకూరు సబ్‌కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవానీతో పాటు నెల్లూరు సిటీ, రూరల్, ఆత్మకూరు, కావలి డీఎస్పీలు ప్రశంసాపత్రాలు పొందారు. ఇలా మొత్తం 515 మంది అవార్డులు పొందారు.



మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, చిత్రంలో కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



వికాస్ మర్మత్ (కార్పొరేషన్ కమిషనర్)



చిరంజీవి (జెడ్పీ సీఈఓ)



సాంబశివారెడ్డి (డీఆర్‌డీఏ పీడీ)



గంగాభవాని (డీఈఓ)



సీహెచ్.చంద్రశేఖర్ (ఆరోగ్యశ్రీ డీఈఓ)



డి.చంద్రశేఖర్ (ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్)



ఎన్.కోటారెడ్డి (ఆత్మకూరు డీఎస్పీ)



రామచంద్ర (కందుకూరు డీఎస్పీ)



వీరాంజనేయరెడ్డి (రూరల్ డీఎస్పీ)



డి.శ్రీనివాసరెడ్డి (నెల్లూరు టౌన్ డీఎస్పీ)



వెంకటరమణ (కావలి డీఎస్పీ)



షేక్.మస్తాన్‌బాషా (ఆర్థోపెడిక్ జీజీహెచ్)

వీరుల త్యాగాలను స్మరించుకుందాం

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట) : భారత స్వాతంత్ర్యం కోసం ఎందరో వీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారిని స్మరించుకుందామని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని చైర్‌పర్సన్ మంగళవారం ఆవిష్కరించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎందరో వీరులు తమ ప్రాణాలను త్యాగం చేసి బానిస బతుకుల నుంచి మన గడ్డను మనమే పరిపాలించుకునే విధంగా చేశారన్నారు. వారి పోరాటాలను స్మరించుకుంటూ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రధాని పిలుపుమేరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్, అంత్యోదయ తక్ కార్యక్రమాల ద్వారా త్యాగధనుల కుటుంబ సభ్యుల ఇంటికి స్వయంగా వెళ్లి వారిని గౌరవించుకున్నామన్నారు. నా భూమి–నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం వంటి అనేక నూతన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని దేశ కీర్తి ప్రతిష్టలు ఇనుమడించేలా విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కారుణ్య నియామకాల ద్వారా ముగ్గురికి ఉద్యోగావకాశాలు కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, అధికారులు పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఎగురవేసిన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, చిత్రంలో అధికారులు

సీఎం ఆశయాలకు తగ్గట్లు పనిచేద్దాం



డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

• డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశయాలకు తగ్గట్లుగా డీసీసీబీని మరింత అభివృద్ధి పథంలో పయనించేలా పనిచేద్దామని డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు రాష్ట్రస్థాయిలో నాలుగు అవార్డులు రావడంతో నగరంలోని గాంధీ బొమ్మసెంటర్ వద్ద ఉన్న ఆ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది, పలు యూనియన్‌లు కలిసి మంగళవారం కామిరెడ్డికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 సంవత్సరానికి నాబార్డ్ ద్వారా రెండు, ఆప్కాబ్ ద్వారా రెండు అవార్డులు తన హయాంలో రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాక ముందు డీసీసీబీ రూ.22 కోట్ల నష్టాల్లో ఉందని, ప్రస్తుతం లాభాల బాటలో పయనిస్తోందని తెలిపారు. అదేవిధంగా బ్యాంకు సీ గ్రేడ్ నుంచి బీ గ్రేడ్‌కు చేరుకుందని, త్వరలో ఏ గ్రేడ్‌కు చేరుకుంటుందన్న నమ్మకం ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బ్యాంకు సిబ్బందికి డివిడెండ్లు, హెచ్ఆర్సీ, పదోన్నతులు, ఖాళీల భర్తీలు చేశామన్నారు. జిల్లా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారం, బ్యాంకు అధికారులు, సిబ్బంది, నాబార్డ్ డీడీఎం, పాలకమండలి సమష్టి కృషి ఫలితంగా అవార్డులు వచ్చాయని వివరించారు. బ్యాంకుకు వచ్చే రైతులు, ఖాతాదారుల అవసరాలను గుర్తించి సకాలంలో రుణాలు అందించడమే ప్రధాన కర్తవ్యమని తెలిపారు. బ్యాంకు బాగుంటేనే అధికారులు, సిబ్బంది బాగుంటారన్నారు. అనంతరం బ్యాంకు సీఈఓ డాక్టర్ శంకర్‌బాబు ఆధ్వర్యంలో సత్యనారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్లను అభినందించి అవార్డులు అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఉద్యోగి శ్రీధర్ కుటుంబసభ్యులకు యూనియన్ సభ్యులు అందజేసిన ఒకరోజు వేతనం రూ.1.50 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు ఖంతర్‌అలీ, రాజేష్, నాబార్డ్ డీడీఎం రవిసింగ్, జీఎం సరిత, డీజీఎంలు దయాకర్‌రెడ్డి, ఉషారాణి, నాగేంద్రకుమారి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కుమార్‌పాల్, బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని వివరిస్తూ.. సంక్షేమాన్ని తెలియజేస్తూ..

• ఆకట్టుకున్న ప్రభుత్వ శకటాలు

నెల్లూరు (దర్గామిట్ట) : నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం ప్రదర్శించిన వివిధ ప్రభుత్వ శకటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీటి ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను అధికారులు, ప్రజలకు వివరించేలా ప్రదర్శనలు నిర్వహించారు. ముందుగా నెల్లూరు నగరపాలక సంస్థకు చెందిన శకటం రాగా వరుసగా జిల్లా నీటియాజమాన్య సంస్థ, పంచాయతీరాజ్ శాఖ, జిల్లా వైద్యారోగ్యశాఖ, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక, మత్స్య, మహిళా శిశు సంక్షేమశాఖ, సమగ్ర శిక్ష, విద్యాశాఖ, గృహ నిర్మాణ, జలవనరులు, పౌర సరఫరాలు, అగ్నిమాపక శాఖలకు చెందిన శకటాలను ప్రదర్శించారు.



ఆదర్శ గ్రామాల దిశగా పల్లెల్లో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ప్రదర్శిస్తున్న శకటం



చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తూ..



ఐసీడీఎస్ శకటం ద్వారా గర్భిణులు, బాలింతలకు జరిగిన మేలును వివరిస్తూ..



నీటి యాజమాన్య శకటం



ఇంటికే వైద్యం అందిస్తూ..

పూరిల్లు దగ్ధం



ఓజిలి : మండల కేంద్రంలోని బీసీకాలనీలో మంగళవారం గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కాలనీకి చెందిన అనగాని బుజ్జయ్య ఇంట్లో పనులు చేసుకుంటున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా పెద్దశబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. ఇంటి బయట పనిచేసుకుంటున్న బుజ్జయ్య కేకలు పెట్టడడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకునేలోపు పూరింట్లో మంటలు ఎగసిపడ్డాయి. ఇంట్లోని సామగ్రి, దుస్తులు, వస్తువులు కాలిపోయాయి. ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.45
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.8

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.147
లేయర్	రూ.96
బ్రాయిలర్ చికెన్:	రూ.252
స్కిన్‌లెస్ చికెన్:	రూ.280
లేయర్ చికెన్:	రూ.163

వ్యాన్ బోల్తా..

• నలుగురికి గాయాలు

దొరవారిసత్రం : ఓమ్నీ వ్యాన్ టైర్లు పగిలిపోయి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడిన ఘటన నెలబల్లి సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చెన్నైకు చెందిన ఏడుగురు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కసుమూరు దర్గాలో మొక్కు తీర్చుకునేందుకు ఓమ్నీ వ్యాన్‌లో బయలుదేరారు. నెలబల్లి వద్దకు వచ్చేసరికి వ్యాన్ ముందు టైర్లు రెండూ పగిలిపోయాయి. దీంతో వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నాయుడుపేటకు తరలించినట్లు హెచ్‌సీ వెంకటేశ్వర్లు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్

జగనన్న సంక్షేమం దేశానికే ఆదర్శం

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల (సోమశిల): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం అనంతసాగరం మండలం చిలకలమర్రి సచివాలయంలోని గుడిగుంట, ఎగువపల్లి, యాకర్లపాడు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్‌ను వారికి అందజేశారు. అంతకు ముందు గుడిగుంట, ఎగువపల్లి రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే దృష్టికి పలువురు సమస్యలు తీసుకు రావడంతో అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. సైడు కాలువల నిర్మాణాలు, నీటి సమస్య పరిష్కరించాలని కోరడంతో అధికారులతో మాట్లాడతానన్నారు. గుడిగుంటలో క్షత్రియులు తమకు బీసీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలంటూ ఎమ్మెల్యేకు విన్నవించడంతో ఈ విషయమై కలెక్టర్‌కు లేఖ అందజేసి ఉన్నాని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఎగువపల్లి ఇళ్ల పట్టాల విషయమై రెవెన్యూ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఆ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనపై రాష్ట్ర ప్రజలంతా ఆనందంగా ఉన్నారని, ప్రతి పక్ష పార్టీ అభిమానులు సైతం జగనన్న పాలనను కోరుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీఓ మధుసూదన్, జేసీఎస్ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, వైస్ ఎంపీపీ ఏ సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి బిజివేముల ఓబుల్‌రెడ్డి, ఎంపీటీసీ పి.వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు బట్రెడ్డి జనార్దన్ రెడ్డి, ముప్పాళ్ల భాస్కర్‌రాజు, ఎన్.రామకృష్ణం రాజు, రాజేంద్ర, శీను, భరత్, సర్పంచ్‌లు శోభ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



గుడిగుంటలో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సంక్షేమ పథకాలతో జనరంజక పాలన

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ జనరంజక పాలన అందిస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ కుడుములదిన్నెపాడు, నరసారెడ్డిపాళెం గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలు, వలంటీర్ల ఏర్పాటుతో ప్రజల వద్దకు పాలనను చేరువ చేశారన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ గెలుపునకు నాందిగా నిలుస్తాయన్నారు. ప్రభుత్వ పథకాలు కొనసాగాలన్నా, రాష్ట్రం అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలన్నా 2024 ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవస్యకత ఉందన్నారు. ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానని, అదరించి రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. నరసారెడ్డిపాళెం మహిళల విజ్ఞప్తి మేరకు గ్రామంలో అక్రమ మద్యం, సారాయి అమ్మకాలు జరపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ నలతాటి మహాలక్ష్మమ్మ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, జిల్లా ప్రచార కార్యదర్శి బొల్లినేని వెంకటసత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ ములకా శ్రీనివాసులు రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మేకపాటి

ముగిసిన త్యాగరాజ స్మరణోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో సోమవారం రాత్రి ప్రారంభమైన సద్గురు త్యాగరాజ స్వామి 71వ స్మరణోత్సవాలు మంగళవారం ముగిశాయి. త్యాగరాజ భక్తబృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంగీత, డోలువాద్య, శాక్సాఫోన్ విద్వాంసులతో పాటు రెండు వేల మందికి పైగా కళాకారులు విశేషంగా తరలివచ్చారు. తమ సంగీత ప్రతిభతో త్యాగరాజ స్వామివారికి నీరాజనం పలికారు. కంచికి చెందిన నాదస్వర విద్వాన్ దేసూరు ఎస్.షణ్ముఖ సుందరం, దేసూరు ఎస్.సేతురామన్ సోదరులతో పాటు పుదుచ్చేరికి చెందిన డోలు విద్వాంసులు డాక్టర్ ఎంఆర్ వాసుదేవన్, కేఎల్.బాలమురళీకృష్ణన్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన శాక్సాఫోన్ కళాకారులు జీవీ సురేష్, పి.వాసు, వీఎం గణపతి, కేఎం మనోహర్ తమ సంగీత ప్రతిభతో ఆకట్టుకున్నారు. అనంతరం సంగీత విద్వాంసుడు కొల్లూరు శ్రీనివాసులు దంపతులతో పాటు పలువురు విద్వాంసులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని నెల్లూరుకు చెందిన త్యాగరాజ భక్తబృందం, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మోమిడి వెంకటరాజు, గౌరవాధ్యక్షుడు చిమటా పరంధామయ్య, ఉపాధ్యక్షుడు వాడపర్తి సురేష్, కార్యదర్శి చేజర్ల ప్రసాద్, కోశాధికారి వినుకొండ శేఖర్ పర్యవేక్షించారు.



సంగీత విద్వాంసులు కొల్లూరు శ్రీనివాసులు దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకలు

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచనలతో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, సయ్యద్ మొబీనా, నాయకులు మొయిళ్ల సురేష్, సుబ్బారెడ్డి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న స్టాల్స్





నెల్లూరు (దర్గామిట్ట) : పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి మంగళవారం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మహిళా శిశుసంక్షేమ శాఖ, వ్యవసాయ, ఏపీఎంఐపీ, హౌసింగ్, వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి, అగ్నిమాపక, వికలాంగుల శాఖ, మెప్మా, పంచాయతీరాజ్ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ ఎం.హరినారాయణన్‌తో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా రూ.3.16 లక్షల విలువ చేసే ల్యాప్‌టాప్, టచ్‌ఫోన్, ట్రైసైకిల్, వీల్‌చైర్స్, వాకర్స్ ఉపకరణాలను మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ శాఖ మిల్లెట్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా ఏర్పాటు చసిన సెల్ఫీ పాయింట్‌లో మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ హరినారాయణన్ ఫొటో దిగారు.

వైభవంగా గంధ మహోత్సవం

ఉదయగిరి : పట్టణంలోని అబ్దుల్ ఖాదర్ ఖాన్‌సాహెబ్ దర్గాలో గంధ మహోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. సాయంత్రం దర్గా కమిటీ ఆధ్వర్యంలో చదివింపుల కార్యక్రమం చేశారు. హక్కుదారులైన సయ్యద్ నూరుల్లాసాహెబ్ ఇంటి నుంచి విద్యుత్ అలంకరణ, మేళ తాళాలు, ఫకీరుల జరబుల నడుమ గంధాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హిందూ, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సీఐ వి.గిరిబాబు, ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఘనంగా ధోబీ మహాసంఘ్ వార్షికోత్సవం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరం ప్రాంగణంలో అఖిలభారత ధోబీ మహాసంఘ్ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పాతపాటి రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జిల్లెల శ్రీరాములు హాజరయ్యారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, రజకులకు రక్షణ చట్టం కల్పించాలని కోరారు. దేవస్థానాల్లో రజకులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాస్, జాతీయ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రజక కార్పొరేషన్ డైరెక్టర్ మల్లీశ్వరి యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ : నగరంలోని వెంకటాచలం-వేదాయపాళెం రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి(34) మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. మృతుడు పింక్, బ్లూ, బ్రౌన్, తెలుపు రంగు గళ్ల ఫుల్ హ్యాండ్స్ షర్ట్‌తో పాటు కాఫీ రంగుపై బ్రౌన్, తెలుపు రంగు డిజైన్ లుంగీ ధరించి ఉన్నారు. ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి యథావిధిగా రైళ్లు

నెల్లూరు(సెంట్రల్) : గూడూరులో మూడోలైన్ రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా తాత్కాలికంగా రద్దు చేసిన పినాకిని ఎక్స్‌ప్రెస్, జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్లు బుధవారం నుంచి యథావిధిగా నడుపుతున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. అదేవిధంగా గూడూరు నుంచి ప్రారంభమయ్యే సింహపురి ఎక్స్‌ప్రెస్, అమరావతి ఇంటర్‌సిటీ రైళ్లు కూడా యాథావిధిగా గూడూరు నుంచే ప్రారంభం అవుతున్నట్లు తెలియజేశారు. దీంతో పాటు తాత్కాలికంగా రద్దు చేసిన మెమూ రైళ్లు కూడా నడుస్తాయన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

హెల్త్ సెంటర్‌లో కంప్యూటర్ల చోరీ

నెల్లూరు సిటీ : గుర్తుతెలియని దుండగులు అర్బన్ హెల్త్ సెంటర్‌లోని రెండు కంప్యూటర్లను చోరీ చేసిన ఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. నగరంలోని రామచంద్రాపురంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో సిబ్బంది సోమవారం విధులు ముగించుకుని తాళాలు వేసి వెళ్లారు. మంగళవారం ఉదయం వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా రెండు కంప్యూటర్‌లు లేకపోవడంతో నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా తలుపు తాళం వద్ద స్క్రూ తొలగించి లోపలికి వెళ్లినట్లు నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై దాడి

• సర్పంచ్, అతని కుమారుడిపై కేసు నమోదు

సంగం : మండలంలోని వీర్లగుడిపాడు మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత సీహెచ్ కృష్ణారెడ్డిపై సోమవారం రాత్రి ఆ గ్రామ సర్పంచ్ చెంచురత్నం నాయుడు, అతని తనయుడు చంద్రబాబు నాయుడు దాడి చేశారు. దీంతో కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు మంగళవారం సంగం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వివరాల మేరకు.. పంచాయతీ నిధులకు సంబంధించి ఏర్పడిన వివాదంతో కృష్ణారెడ్డి ఇంటికి చెంచురత్నం నాయుడు, చంద్రబాబు నాయుడు వచ్చి నానా దుర్భాషలాడారు. అనంతరం దాడి చేశారు. దీంతో కృష్ణారెడ్డి మంగళవారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు.